ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

విశాలాంధ్ర-తాడికొండ : చెదురుమొదురు ఘటనలు మినహా సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. వేసవికాలం కావడంతో తెల్లవారుజాము నుంచి ఓటర్లు అధిక సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. మండలంలో 57 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం మందకోడిగా సాగిన పోలింగ్ మూడు గంటల నుంచి పోలింగ్ సరళి పెరిగింది. మండలంలో 70 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నారైలు, ఇతర రాష్ట్రాలలో ఉన్న ఓటర్లు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నిడుముక్కల గ్రామంలో టీడీపీ, వైసీపీ నాయకులు మధ్య జరిగిన వివాదంలో మాజీ సర్పంచ్ బండ్ల శివయ్య తలకు స్వల్ప గాయమైంది. లచ్చన్న గుడిపూడిలో ఇరు వర్గాలు పోలింగ్ కేంద్రం వద్ద వాగ్వాదానికి దిగటంతో పోలీసులు రంగప్రవేశం చేసి వారిని చెదరగొట్టారు. రావెల, లాం గ్రామాలలో స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయి. ఎలాంటి కేసులు నమోదు కాలేదు. పోలింగ్ ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

ఓటు వేసిన 101 సంవత్సరాల వృద్ధురాలు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి సీకే గర్ల్స్ హై స్కూల్లోని 156వ పోలింగ్ బూత్‌లో సోమవారం 11వ వార్డుకు చెందిన చింత క్రింది లక్ష్మీనరసమ్మ అనే 101 సంవత్సరాల వృద్ధురాలు ఓటు హక్కు వినియోగించుకుంది.

సొమ్మసిల్లి పడిపోయిన మహిళా ఓటర్

విశాలాంధ్ర-తాడికొండ : అధిక ఉష్ణోగ్రత, ఉక్కపోతతో ఓ మహిళ ఓటరు పోలింగ్ కేంద్రం వద్ద పడి పోయింది. నియోజక వర్గ కేంద్రమైన తాడికొండకు చెందిన బండ్ల మూడి అనంతలక్ష్మి ఓటు వేసేందుకు సోమవారం జయ భారత కాలనీలోని 57వ బూత్‌కు వచ్చారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకు నేందుకు అధిక సంఖ్యలో వచ్చారు. క్యూ ఎక్కువగా ఉండటంతో ఓటు వేసేందుకు వచ్చిన అనంతలక్ష్మి పడిపోయింది. స్పందించిన ఏఎన్ఎం హేమలత, ఆశ వర్కర్ చలివేంద్రం హైమావతి, అనంతలక్ష్మికి వైద్య సహాయంతో పాటు గ్లూకోజ్ నీరు అందించి బీపీ చెక్ చేశారు. కొద్ది విరామం అనంతరం ఆమె తమ ఓటు హక్కును వినియోగించుకొని ఇంటికి వెళ్లారు.

ఓటు హక్కు వినియోగించుకున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి తాడేపల్లి కరకట్టలోని గుడ్ న్యూస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో సోమవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖా స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

తెనాలిలో అధికంగా కురిసిన వర్షం

విశాలాంధ్ర- తెనాలి : తెనాలిలో సోమవారం మధ్యాహ్నం పెద్ద వర్షం కురిసింది. ఈ వర్షం వలన పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు లేనందు వలన ఓటర్లు తడిసి ముద్దయ్యారు. ఉరుములతో, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అధికారులకు వర్షం వస్తుందనే ఆలోచన లేని కారణంగా ఏర్పాట్లు చేసివుండరని ఓటర్ల ఊహ. రోడ్లు పైన వర్షపు నీరు కాలువలాగ ప్రవహించింది. అంత కురిసినప్పటికి సంతోషదాయకంగా ఉన్నారు. వర్షం కారణంగా సైడు కాలువలలో నీరు రోడ్లమీదకు వచ్చింది. వర్షం తగ్గిన తరువాత ఇంకా రావల్సిన ఓట్లరు పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వర్షం కారణంగా వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఆహ్లాదంగా ఉన్నారు.

ఓటు వేసిన నిమ్మగడ్డ

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల కేంద్రమైన దుగ్గిరాలలో సోమవారం జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో రిటైర్డ్ ఐఏఎస్, రాష్ట్ర మాజీ ప్రధాన ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దుగ్గిరాల బాలికల హైస్కూల్‌లోని 247 పోలింగ్ బూత్‌లో తొలి ఓటు వేశారు. గత ఏడాది తన పుట్టిన ఊరులో ఓటు హక్కు పొందారు. సదరు పోలింగ్ బూత్‌లో ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది.

నిడుముక్కలలో ఉద్రిక్తత

విశాలాంధ్ర-తాడికొండ : ఎన్నికల సందర్భంగా స్వల్ప వివాదం జరిగిన నేపథ్యంలో సోమవారం నిడుముక్కల గ్రామంలో ఇరు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. రాళ్లు రువ్వుకున్నారు. సీఐ సిహెచ్ ప్రభాకర్ రావు ఎడమ కాలుకు స్వల్ప గాయమైంది. ఘటనలో గ్రామానికి చెందిన గుజ్జర్లపూడి రమేష్ అతని భార్య స్వరూపకు గాయాలయ్యాయి. ఇరు వర్గాలు అమరావతి-గుంటూరు రహదారిపై బైఠాయించారు. పోలీసులు రంగప్రవేశం చేశారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

పోలింగ్ ప్రశాంతం

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఓటింగ్‌లో ప్రజలు సునామీ సృష్టిం చారు. ఇంతవరకు ఎప్పుడూ ఇంత పోలింగ్ శాతం నమోదు కాలేదు. నియోజకవర్గ పరిధిలో అన్ని మండలాలలో చెదురు మదురు సంఘటనలు మినహా ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. మహిళలు ఓటింగ్‌లో అధికశాతం పాల్గొన్నారు. టీడీపీఅభ్యర్థి బి.రామా ంజనేయులు పోలింగ్ బూత్‌లను సందర్శించి పోలింగ్ సరళని పరిశీలి ంచారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొరివి వినయ్ కుమార్ పోలింగ్ బూత్‌లను సందర్శి ంచి సంతృప్తి వ్యక్తం చేశారు. రాజీనామా చేసిన వలంటీర్లు పోలింగ్ బూత్ వద్ద ఓటర్లను ప్రభావితం చేస్తుండగా టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. సాయంత్రం 6 గంటలకి 80 శాతం పోలింగ్ నమోదైంది.

ఓటు వేసిన 'జంగాల', 'ముప్పాళ్ల'

గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు దంపతులు

విశాలాంధ్ర-గుంటూరు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇండియా కూటమి బలపరిచిన గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు దంపతులు సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుంటూరు ఎల్‌బీ నగర్ ఉన్నత ప్రాథమిక పాఠశా లలో జంగాల ఓటు వేయగా, లాడ్జిసెంటర్ సమీపంలోని ఎల్ఈఎం స్కూల్‌లో ముప్పాళ్ల దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా, ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్... పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించి ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున ప్రజలకు తాగు నీరు, టెంట్, వైద్య సదుపాయాలు కల్పిం చాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. నగరంలోని వివిధ బూత్‌లను సందర్శించి ఎన్నికల సరళిని పరిశీలించారు. పార్ల మెంట్ పరిధిలోని మంగళగిరి తదితర అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను సందర్శించారు.

మంగళగిరిలో ఓటు వేసిన పవన్ కళ్యాణ్

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి నగరంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కాలనీ 197వ పోలింగ్ బూత్‌లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఓటు వేశారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురు గుడు లావణ్య, వైసీపీ ఎమ్మెల్సీ మురు గుడు హనుమంత రావులు సీకే జూని యర్ కాలేజీలో తమ ఓటును వినియోగించు కున్నారు. వైసీపీ ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, వైసీపీ సోషల్ మీడియా అధ్యక్షులు సజ్జల భార్గవ్ రెడ్డి వారి కుటుంబ సభ్యులతో కలిసి కాజా గ్రామంలోని 133వ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు వేసిన జొన్న

విశాలాంధ్ర-తాడేపల్లి : ఇండియా కూటమి బలపరి చిన మంగళగిరి సీపీఎం అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జొన్న శివశంకర్ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించి ప్రజలకు వాటర్ సమకూర్చాలని ఎలక్షన్ డిపార్ట్మెంట్ వారికి సూచిం చారు. 2019 కన్నా ఓటింగ్ శాతం పెరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు.

తెనాలిలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

విశాలాంధ్ర-తెనాలి : తెనాలిలో సోమవారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయి. అక్కడక్కడ చెదురుమొదురు సంఘటనలు మినహా శాంతియుతంగా జరిగాయి. ఉదయం నుండి ఓటర్లు పోలింగ్ బూతుల వద్ద బారులు తీరారు. ఎన్నికల సిబ్బంది ఏర్పాట్లను సక్రమంగా నిర్వహించారు. ప్రజలు మధ్యహ్నేనం వరకు ఎండలో, వానఝులులో కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 70శాతం ఓటింగ్ పోలయ్యాయి. ఎన్నికల నిర్వహణలో అధికారులు సిబ్బంది తమ విధి నిర్వహణను సక్రమంగా నిర్వ హించారు. పోలింగ్ బూత్‌ల వద్ద బార్కెట్లు ఏర్పాటు చేసి ఓటర్లను క్రమబద్ధంగా పంపించారు. నియోజక వర్గంలో పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరి ఉండటంతో కొంత సమయం ఎక్కువ పట్టినా అందరూ తమ ఓట్లను వినియోగించుకునేం దుకు అధికారులు సహకరిం చారు. పోలింగ్ స్టేషన్ల నుండి బ్యాలెట్ పెట్టెలు, ఇతర సామాగ్రిని రాత్రి పొద్దుపోయేవరకు ఉన్నత అధికారులు సేకరించి ప్రొసిడింగ్ అధికారి కార్యాలయానికి చేర్చారు. ఐతానగర్‌లో అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌కు స్థానిక పోలింగ్ బూత్ వద్ద చిన్న సంఘర్షణ జరిగినట్లు తెలిపారు. పోలీసులు జోక్యం చేసుకొని విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

నులకపేట పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎంటీఎంసీ పరిధిలోని నులకపేట పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొంది. వైసీపీ, టీడీపీ కార్యకర్తలు కొట్టుకున్నారు. క్యూ లైన్లలో ఉన్న ఓటర్లను కొందరు అజ్ఞాత వ్యక్తులు ప్రలోభాలకు గురిచేస్తున్నారంటూ ఇరు పార్టీల ఏజెంట్లు ఆరోపణ చేశారు. ఇరువర్గాల వారు పిడిగుద్దు లతో భయానక వాతావరణం సృష్టించారు. పోలీసులు చేతులు ఎత్తివేశారు. ఓటర్లు ఆందోళనకు గురయ్యారు.

ఉండవల్లిలో ఘర్షణ: ఉండవల్లిలో ఘర్షణ నెలకొంది. క్యూ లైన్‌లో ఉన్న వారికి ప్రత్యేక టోకెన్లు జారీ చేశారు. ప్రత్యేక టోకెన్లు జారీపై ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక స్లిపులు లేకుండా ఓటు వేసేందుకు అనుమతి ఇవ్వమని అధికారి తెలిపారు. అధికారి తీరుపై ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మంగళగిరిలో 6వ బెటాలియన్ పోలీసుల ఆందోళన

విశాలాంధ్ర-మంగళగిరి : పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళగిరి ఏపీఎస్పీ 6వ బెటాలియన్ పోలీసులు మంగళగిరి రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఎన్నికల విధుల నిమిత్తం మహారాష్ట్ర వెళ్ళిన పోలీసులు సోమవారం వచ్చారు. మహారాష్ట్రలో విధులకు వెళ్ళొచ్చాక పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తామని గతంలో చెప్పిన అధికారులు మాట తప్పారని విమర్శించారు. ఈ మేరకు మంగళగిరి తహశీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. తమకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు కల్పించు కోవడంతో సమస్య సద్దుమణిగింది. ఈ ఆందోళనలో 25 మంది పోలీసులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలన : జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-మంగళగిరి : ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ గుంటూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ సోమవారం మంగళగిరి పట్టణంలోని టిప్పర్ల బజార్‌లో గల పోలింగ్ కేంద్రాన్ని, ఆత్మకూరులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లతో పోలింగ్ ఎలా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఓటర్లకు మంచినీరు, మెడిసిన్ సదుపాయం కల్పించాలని కోరారు.కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరపతయ్య, జిల్లా నాయకులు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, కాబోతు ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఓటు వేసిన చంద్రబాబు కుటుంబం

విశాలాంధ్ర-తాడేపల్లి : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉండవల్లిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి చంద్రబాబు ఆయన సతీమణి భువనేశ్వరితో కలిసి చేరుకొని ఓటు వేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి అదే పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం

విశాలాంధ్ర-ఈపూరు : మండలంలో ప్రధానంగా వైసీపీ, టీడీపీల అభ్యర్థులకు పోటాపోటీగా ఓటర్లు ఓటు వేసారు. అసలు అంచనాలకు అందకుండా ఈ ఎన్నికల్లో ఓటరు తమ తీర్పు ఇవ్వబోతున్నారు. మండలంలో పలుచోట్ల ఈవీఎంలు ప్రారంభంలోనే మోరాయించాయి. అధికారులు వెంటనే ఆ సమస్యను పరిష్కరించి ఓటింగ్‌కు ఎలాంటి అంతరాయం జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ బూత్ వద్ద ఉదయం ఆరు గంటల నుంచి ఓటర్లు బారులు తీరారు. ఓటు వేసేందుకు యువకులు, వృద్ధులు, వికలాంగులు, మహిళలు ఉత్సాహంగా పోలింగ్ బూత్‌లకు తరలివచ్చారు. కొచ్చర్ల, బొమ్మరాజు పల్లి, ముప్పాళ్ళ, ఎర్రబాలెం గ్రామాలలో చెదురుమదురు సంఘటనలు తప్ప ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. ముఖ్యంగా మహిళలు, యువతీయువకులు ఓటు వేసేందుకు ఎంతో ఆసక్తి కనపరిచారు. జిల్లా ఎస్పీ, డీఎస్పీ, ఓఎస్డీ ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై మహమ్మద్ ఫిరోజ్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలతో బందోబస్తు నిర్వహించారు.

ఈవీఎంలు మొరాయించడం మినహా పోలింగ్ ప్రశాంతం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎంలు మొరాయించటం, అక్కడక్కడ చెదురు మొదురు సంఘటనలు మినహా సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమైంది. అప్పటికే ఓటర్లు ఓట్లు వేసేందుకు క్యూలో సిద్ధంగా ఉన్నారు. ఈవీఎంలు నిదానంగా పనిచేయటం వలన ఓటింగ్ ప్రక్రియ ఆలస్యంగా జరిగింది. దీంతో ఓటర్లు కొన్ని పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరి పోలింగ్ మందగొడిగా సాగింది. ఇది ఇలా ఉండగా మంగళగిరి పట్టణంలో పలు కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు. మంగళగిరి రూరల్ పరిధిలోని గ్రామంలో ఈవీఎంలు ఎక్కువ సేపు మొరాయించటం వలన గంటలకు కొద్ది ఓటర్లు వేచి ఉండాల్సి వచ్చింది. వాస్తవానికి పోలింగ్ ముగింపు ఆరు గంటలకే చేయాల్సి ఉంది ఓటింగ్ ప్రక్రియ ఆలస్యం వలన వలన 7, 8 గంటల కూడా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరుగుతోంది. ఆయా పార్టీల అభ్యర్థులు ప్రముఖులు మంగళగిరి నియోజకవర్గంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రధాన అభ్యర్థులు ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉన్నందున ఎవరికి వారే మాకే లాభం చేకూరుతుందని అంటున్నారు.

ఓటు వేసిన బొల్లా బ్రహ్మనాయుడు, తన సతీమణి

విశాలాంధ్ర-శావల్యాపురం : వినుకొండ వైసీపీ నుంచి పోటీ చేస్తున్న బొల్లా బ్రహ్మనాయుడు, తన సతీమణి ఆదిలక్ష్మితో కలిసి మండలంలోని తన సొంత గ్రామమైన వేల్పూరులో ఉదయం పోలింగ్ బూత్ నెంబర్ 110లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఘంటావారిపాలెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెన్నా శ్రీనివాస రావు, శానంపూడి గ్రామంలో ఇండిపెండెంట్ అభ్యర్థి ఆర్కే నాయుడు తమ ఓటును వినియోగించుకున్నారు. ఇతర ప్రాంతాలలో నివాసం ఉంటున్న ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం ఇతర ప్రాంతాల నుంచి బారీగా తరలివచ్చారు. సోమవారం ఉదయాన్నే వర్షం కురవడంతో వాతావరణం చల్లగా ఉండగా ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు ఎక్కువ సంఖ్యలో చేరుకుని ఓటు వేసేందుకు క్యూ కట్టారు. మండలం లోని వేల్పూరు, కారుమంచి, గుంటుపాలెం, పిచికలపాలెం, శానంపూడి, మతుకుమల్లి, ఇర్లపాడు గ్రామా లలో పోలింగ్ సమయంలో చెదురుమొదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. కొత్తగా ఓటు హక్కు పొందిన యువత నుంచి భారీ స్పందన లభించింది. అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి, రూరల్ సీఐ ఉప్పుటూరు సుధాకర్, ఎస్ఐ చల్లా సురేష్‌లు పోలింగ్ కేంద్రాలు నిరంతరం పరిశీలించి బందోబస్తు ఏర్పాటు చేశారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

ప్రధాన పార్టీల గెలుపు ఓటములపై సీపీఐ అభ్యర్థి ప్రభావం

– సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు పార్లమెంట్‌కు సీపీఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ గణనీయమైన ఓట్లు సాధించి పార్లమెంట్ పరిధిలోని ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటములపై ప్రభావం చూపుతారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. గుంటూరులో సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. ఎనిమిది రాష్ట్రాలలో జరుగుతున్న 4వ విడతల ఎన్నికల సరళిని పరిశీలిస్తే బీజేపీ వెనకబడిపోయిందని తెలుస్తుందని అన్నారు. దీంతో బీజేపీ ఓటమి ఖాయమని అన్నారు. రాష్ట్రంలో కూడాగుణాత్మకమైన మార్పు జరుగుతుందని తెలిపారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వాదాన్ని రక్షించుకోవాలనుకునే ప్రతిఒక్కరూ ఇండియా కూటమిని బలపరుస్తున్నారని, ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

– విశాలాంధ్ర-గుంటూరు

కమాండ్, కంట్రోల్ సెంటర్ పరిశీలన

విశాలాంధ్ర-గుంటూరు : జిల్లాలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించేందుకు కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సోమవారం మధ్యాహ్నం ప్రత్యేక సాధారణ పరిశీలకులు రామ్ మోహన్ మిశ్రా, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్ దూడి, అసిస్టెంట్ కలెక్టర్(ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌లతో కలసి పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ : ఎస్పీ

విశాలాంధ్ర-మంగళగిరి : గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడి సోమవారం మంగళగిరి పట్టణంలోని టిప్పర్ల బజార్‌లో గల పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిడమర్రు రోడ్‌లో దిగి బ్యాంక్ కాలనీ నుంచి నడుచుకుంటూ వెళ్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వెంటనే వెళ్లిపోయారు. వివిధ రాజకీయ పార్టీలు చెందిన నాయకులు హడావుడిగా హడావుడిగా వెళ్ళిపోయారు.

రాజధాని ప్రాంతంలో ఓటంగ్ ప్రశాంతం

విశాలాంధ్ర-తుళ్లూరు : రాజధాని అమరావతిలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. స్వల్ప వివాదాలు మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. ఉదయం కొంచెం ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభమైంది. సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో మధ్యాహ్నం వరకు ఓటింగ్ మందకొడిగా సాగింది. మధ్యాహ్నం అనంతరం ఓటింగ్ ప్రక్రియ వేగం పుంజుకుంది. సాయంత్రం పోలింగ్ ముగిసే సమయం 6 గంటలకు కూడా ఓటు వేసేందుకు ఓటర్లు భారీ సంఖ్యలో క్యూలో నిలుచున్నారు.

పెదపరిమిలో స్వల్ప ఉద్రిక్తత: మండల పరిధిలోని పెదపరిమిలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. వైసీపీకి చెందిన శృంగారపాటి సందీప్ గ్రామంలోని ఆంధ్ర పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లగా టీడీపీ వర్గీయులు అభ్యంతరం తెలిపారు. నువ్వు ఈ గ్రామానికి చెందిన వాడివికాదు.. నీకు ఇక్కడ ఏం పని అని అనగా నేను ఎమ్మెల్యే సుచరిత తరపున ఎన్నికల ఏజెంట్‌నని, గుర్తింపు కార్డు చూపినా టీడీపీ వర్గీయులు అక్కడ నుంచి వెళ్ళిపొమ్మని అనడంతో గొడవ మొదలైంది. దీంతో పోలీసులు సందీప్‌ను తీసుకెళ్లి కారు ఎక్కించారు. ఈ సమయంలో కొంతమంది కారు అద్దాలు పగలగొట్టారు. వైసీపీ, టీడీపీ కార్యకర్తల తలకు గాయమైంది. గొడవలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎమ్మెల్యే సుచరిత పెదపరిమితో పాటు తుళ్లూరు, దొండపాడు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి ఎన్నికల నిర్వహణపై ఆరా తీశారు.

మామా అల్లుళ్ళ గెలుపు కోసం : పెదపరిమికి చెందిన వైసీపీ, టీడీపీకి చెందిన కొంతమంది నాయకులు పెదకూరపాడు వెళ్లారు. పెదకూరపాడు అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న భాష్యం ప్రవీణ్, వైసీపీ నుంచి పోటీ చేస్తున్న నంబూరు శంకర్రావు పెదపరిమి గ్రామానికి చెందినవారు. వీరిద్దరూ వరసకు మామా, అల్లుళ్లు అవుతారు. వీరి గెలుపుకు తోడ్పాటునందించేందుకు రెండు పార్టీలకు చెందిన కొంతమంది పెదకూరపాడు వెళ్లడం విశేషం. పోటీలో ఉన్నవాళ్లు తమ గ్రామానికి చెందినవారు, బంధువులు కావడంతో వారి గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకొని పెదకూరపాడు వెళ్లడం విశేషం.

ఓటు వేసిన ధూళిపాళ్ల, అంబటి మురళి

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు మండలం చింతలపూడి గ్రామంలో సోమవారం కూటమి అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుటుంబ సభ్యులతో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కేంద్రంలోని పోలింగ్ సరళిని ఆయన పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటింగ్ సరళిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంబటి వెంట గ్రామ సర్పంచ్ జాలాది యానాదిరావు ఉన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ఓటు వేసిన నంబూరు శంకరరావు, భాష్యం ప్రవీణ్

విశాలాంధ్ర-పెదకూరపాడు : సార్వత్రిక ఎన్నికలలో మండల పరిధి లోని 75 తాళ్లూరు జేబీ పాఠశాలలో వైసీపీ అభ్యర్థి నంబూరు శంకర్రావు ఓటు వినియోగించుకున్నారు. ఎన్డీఏ కూటమి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ తాటి కొండ మండలం పరిమి గ్రామంలో ఓటుని వినియోగించుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని పెదకూరపాడు, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ, అమరావతి మండలాల్లో 85 శాతం పోలింగ్ నిర్వహించినట్లు ఆర్వో శ్రీరాములు తెలిపారు. ఉదయం 7 గంటలకి బారులుతీరి సాయంత్రం 8 గం. వరకు ఓటుని వినియోగించుకున్నారు.

చెదురుమదురు సంఘటనలతో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

విశాలాంధ్ర-చిలకలూరిపేట : చెదురుమదురు సంఘటనల మినహా మొత్తం మీద చిలకలూరి పేటలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం ఏడు గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ ఈవీఎంలు మొరాయించటంతో కొన్ని చోట్ల ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7 గంటలకే ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద క్యూ కట్టారు. ముఖ్యంగా మహిళలు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. పట్టణంలో దుకాణాలు మూతపడటంతో కర్ఫ్యూ వాతావరణం కనిపిం చింది. ఉదయం మందకొడిగా ప్రారంభంమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రానికి ఊపందు కుంది. పట్టణంలో పలుచోట్ల ఈవీఎంలు మొరాయించాయి. 165, 166, 180, 181 పోలింగ్ బూతులు ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభం గాక ఓటర్లు బారులుతీరారు. సాయంత్రం సమయానికి పట్టణంలో వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, ఇతర సాంకేతిక కారణాలతో ఈవీఎంలు పనిచేయలేదు. కొంత సమయం అనంతరం వీటిని తిరిగి పునరుద్ధరించారు. ఉదయం 8 గంటల వరకు కేవలం 10 శాతమే నమోదైన పోలింగ్ సాయంత్రం 5 గంటల సమయానికి 71.87కు చేరుకోవడం విశేషం.

వసతుల కొరత : చిలకలూరిపేట భారతరత్న ఇందిరాగాంధీ పబ్లిక్ స్కూల్‌లో టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన సతీమణి వెంకటకుమారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. చిలకలూరిపేట పట్టణంలోని మదర్ థెరిస్సా కాలనీలోని 139వ పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియో గించుకున్నారు. చిలకలూరిపేటలోని పలు ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌ల వద్ద సరైన సౌకర్యాలు కల్పించడంలో ఎన్నికల అధికారులు విఫలమయ్యారు.

నగదు కోసం ఓటర్ల ఆందోళన..

గతం కన్న భిన్నంగా ఈ ఎన్నికల్లో నగదు కోసం ఓటర్లు పలు ప్రాంతాల్లో ఆందోళనకు దిగారు. తమకు డబ్బులు ఇవ్వలేదని కొంతమంది ఓ పార్టీ అభ్యర్థి పార్టీ కార్యాలయానికే వెళ్లి నిలదీశారు. మరోవైపు పలు వార్డుల్లో ఇటువంటి ఆందోళనలు కొనసాగాయి. 146, 147 బూత్‌ల పరిధిలో వైసీపీ వారు టోకెన్లు పంపిణీ చేసి డబ్బులు ఇవ్వలేదని ఆందోళనకు దిగారు. గణపరం తదితర ప్రాంతాలలో డబ్బులు అందలేదని ఓటర్లు ఆరోపించారు.

స్వల్ప ఘర్షణలు.. వివాదాలు..

నాదెండ్ల మండలం బుక్కాపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి మల్లెల రాజేష్ నాయుడుకు వైసీపీ వర్గానికి చెందిన వారికి మధ్య వివాదం చెలరేగింది. పోలీసులు చేరుకొని వివాదాన్ని నివారించారు. పట్టణంలోని 136 నెంబర్ బూతులో తెలుగుదేశం పార్టీ ఏజెంట్లను వైసీపీకు చెందిన నాయకులు ఇబ్బందిపెడుతున్నారని ఫిర్యాదుతో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, పత్తిపాటి వెంకట కుమారి అక్కడికి చేరుకొని ఎన్నికలు సక్రమంగా జరిగేలా చూడాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొత్తం మీద ఎన్నికలు చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసాయి.

పోలింగ్‌లో పాల్గొనటానికి గ్రామస్తులు భయాందోళన

విశాలాంధ్ర-రెంటచింతల : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం జరిగిన పోలింగ్ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ ప్రక్రియ సజావుగా జరుగగా సమస్యాత్మక గ్రామంగా గుర్తించిన రెంటాలలో మాత్రం అధికారులు ప్రకటించిన విధంగా చర్యలు లేని కారణంతో అక్కడి పోలింగ్‌లో పాల్గొనటానికి గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. పోలింగ్ ప్రక్రియకు గంట ముందే ఇరువర్గాల వారు పాశవిక దాడులకు పాల్పడటంతో ఇద్దరు మహిళలు, ముగ్గురు వ్యక్తుల తలలు పగిలి ఆసుపత్రిపాలయ్యారు. కర్రలు, కొడవళ్ళతో జరిపిన దాడిలో చేర్రెడ్డి మంజుల, గోపాల్ రెడ్డి తీవ్రంగా గాయపడగా, రాజేశ్వరి, రఘురామిరెడ్డి, గొంటు నాగమల్లేశ్వరరెడ్డిల తలకు గాయాలు కాగా వారిని గురజాల ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రు లను టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి పరామర్శించారు. మధ్యాహ్నా సమయంలో గ్రామంలో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్లిన టీడీపీ అభ్యర్థి బ్రహ్మారెడ్డిపై వైసీపీ మూకలు కారం చల్లి దాడికి యత్నించారు. సమస్యాత్మకంగా గుర్తించిన ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలతో మోహరింపు చేసి ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపడతామన్న అధికారుల మాటలు చేతల్లో లేకపోవడంపై గ్రామస్తులు నిరసించారు. కాగా పాల్వాయి గేట్‌లో రిగ్గింగ్ జరుగుతుందని తెలిసి వచ్చిన వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై టీడీపీ శ్రేణులు దాడి చేయగా ఎమ్మెల్యే వాహనం ధ్వంసం కాగా ఎమ్మెల్యే కుమారుడు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. తుమ్మకోటలో టీడీపీ నేతలు, కార్యకర్తలు సీసీ కెమెరా ధ్వంసం చేసి పోలింగ్ కేంద్రంలోకి దౌర్జన్యంగా చొరబడి ఈవీఎంలను పగలగొట్టి అరాచకానికి సృష్టించారు. పోలింగ్ మరో గంటలో ముగియనున్న సమయంలో గోలి గ్రామంలో వైసీపీ, టీడీపీ వర్గాలు రాళ్లతో పరస్పర దాడులకు పాల్పడ్డాయి. దాడుల్లో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు.

కన్నా పై దాడి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : ఎన్నికల ఓటింగ్ ప్రక్రియలో ముప్పాళ్ళ మండలం చాగంటి వారి పాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ లోని పోలింగ్ కేంద్రంలో దగ్గరుండి రిగ్గింగ్ చేయించిన అంబటి రాంబాబు అనుచరులను అడ్డుకోబోయిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పై రాళ్ల వర్షం కురిపించారనీ, తెలుగుదేశం నాయకులు విమర్శించారు. ముప్పాళ్ళ మండలంలోని చాగంటి వారి పాలెం గ్రామానికి చెందిన వైకాపా అల్లరి మూకల్ని అడ్డుపెట్టుకుని, అంబటి రాంబాబు రిగ్గింగ్ చేయించార న్నారు. పోలింగ్ కేంద్రాలను చూడనివ్వ కుండా పాఠశాలలో తన అల్లరి మూకల్ని ఉంచి రిగ్గింగ్ చేయిస్తూ. అడ్డుకోబోయిన కన్నా లక్ష్మీ నారాయణపై తెలుగుదేశం పార్టీ శ్రేణులపై రాళ్లతో కర్రలతో దాడి చేయించారు. ఈ దాడి పై కన్నా లక్ష్మీనారాయణ నియోజకవర్గ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు.

జిల్లాలో తెల్లవారుజాము నుంచి బారులుతీరిన ఓటర్లు

ఓటు వేసిన జిల్లా కలెక్టర్ శివశంకర్

ఓటు వేసిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కుటుంబసభ్యులు

ఓటు హక్కును వినియోగించుకున్న ట్రాన్స్‌జెండర్స్

విశాలాంధ్ర-నరసరావుపేట : పల్నాడు జిల్లాలో ఓటర్లు చైతన్యవంతమై సోమవారం తెల్లవారు జాము నుంచి పోలింగ్ బూతుల వద్ద ఓట్లు వేసేందుకు బారులు తీరారు. పోలింగ్ ప్రారంభానికి ముందు పోలింగ్ బూత్‌ల ఎదుట మహిళలు పెద్దఎత్తున ఓట్లు వేసేందుకు క్యూ లైన్‌లో ఉన్నారు. ఒకవైపు పోలింగ్ బూత్‌లలో వైసీపీ, టీడీపీ వర్గాలు బాహాబాహికి దిగుతూ రక్తసిక్తమౌతుండగా మరోవైపు వృద్ధులు, మహిళలు, యువకులు తగ్గేదెలే అంటూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోటీలు పడ్డారు. మరొపక్క వేసవి తీవ్రత అధికంగా ఉన్నప్పటికి ఎవరికి వారు ఓటు హక్కును వినియోగించు కోవడంతో పోలింగ్ శాతం గంట గంటకు గతంలో ఎన్నడూ లేని విధంగా పెరుగుతూ వచ్చింది. ట్రాన్స్‌జెండర్స్ సైతం ఈ ఎన్నికలలో పోటీపడి ఓటు హక్కు వినియోగించు కున్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పట్ట ణంలోని 121వ పోలి ంగ్ స్టేషన్‌లో ఓటు వేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దంపతులు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ అరవింద బాబు దంపతులు పట్టణంలో తమ ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు స్వయంగా వెళ్ళి పరిశీలించారు. రాత్రి 9 గంటలకు 75.02 శాతం నమోదైనట్లు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం ప్రకటించింది. పలు ప్రాంతాల్లో ఇంకా పోలింగ్ జరుగుతున్నట్లు తెలిపారు. తుది జాబితా మంగళవారం ఉదయం ప్రకటిస్తామని తెలిపారు.

ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు

ఓటు హక్కు వినియోగించుకున్న కన్నా, అంబటి

విశాలాంధ్ర- సత్తెనపల్లి : సత్తెనపల్లి నియోజకవర్గ అసెంబ్లీకి పోటీ చేస్తున్న వైసీపీ అభ్యర్థి మంత్రి అంబటి రాంబాబు తన సతీమణి విజయలక్ష్మితో కలిసి సత్తెనపల్లి పట్టణంలో తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. తెలుగుదేశం జనసేన భారతీయ జనతా పార్టీ ఉమ్మడి అభ్యర్థి మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ తన కుమారులు నాగరాజు ఫణీంద్రలతో కలిసి హెూలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలోని పోలింగ్ బూత్ లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రక్తసిక్తమైన నియోజకవర్గం

విశాలాంధ్ర- సత్తెనపల్లి : సార్వత్రిక ఎన్నికల రోజు సత్తెనపల్లి నియోజకవర్గం రక్తసిక్తమైంది గతంలో ఎన్నడూ లేని విధంగా అనేక గ్రామాలలో వైసిపి కూటమి కార్యకర్తల మధ్య తోపులాటలు రాళ్ల దాడులు కారుల ద్వంశాలు చోటుచేసుకున్నాయి సోమవారం ఉదయం ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రారంభం కాగా సాయంత్రం సమయానికి నియోజకవర్గంలోని పలు మండలాలలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి మొదటగా ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు వైసిపి టిడిపి సీనియర్ల మధ్య తీవ్ర రాళ్ల దాడులు జరిగాయి ఈ దాడుల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన 12 మందికి పైగా కార్యకర్తలు తీవ్ర గాయాలు పాలయ్యారు వీరిలో కొందరు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వారిని సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చేసి అనంతరం గుంటూరు తరలించారు ఆ తదుపరి అదే మండలంలోని నార్లపాడులో మంత్రి అంబటి రాంబాబు అల్లుడు నియోజకవర్గ ఏజెంట్ గా ఉండగా నార్లపాడు గ్రామంలో ఏజెంట్ మార్పు విషయంలో వివాదం చోటు చేసుకోవడంతో ఆయన కారుపై తెలుగుదేశం కార్యకర్తలు దాడులు చేసి గ్రామం నుండి తరిమికొట్టారు. సత్తెనపల్లి పట్టణం 20వ వార్డులో ఏజెంట్ విషయంలో వివాదం చోటు చేసుకోవడంతో వార్డు కౌన్సిలర్ గా ఉన్న రాడ్డు శీను అనే వ్యక్తిని కొంతమంది తీవ్రంగా గాయపరిచారు అతనితో పాటు మరో వ్యక్తిపై దాడి చేయడంతో వీరిని సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు మాదల గ్రామంలో వైసీపీ తెలుగుదేశం వర్గాల మధ్య వాగ్వివదాలు తోపులాటలు సంభవించాయి రాజుపాలెం మండలం వైసీపీ నాయకులు మర్రి సుబ్బారెడ్డి పై కొందరు దాడి చేయడంతో ఆయన తల పగిలింది ఆయనను సమీప వైద్యశాలకు తరలించారు సత్తెనపల్లి మండలం రెంటపాల గ్రామంలో వైసీపీ కూటమి నాయకులు కార్యకర్తలు మధ్య పోలింగ్ బూత్ వద్దా ఇరువర్గాలు తోపులాటలతో తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొన్నది. పట్టణంలోని పలు వార్డుల్లో వైసిపి తెలుగుదేశం జనసేన కార్యకర్తల మధ్య వాగ్వివాదాలు తోపులాటలు జరిగాయి ఎన్నికల ముగిసిన సమయంలో ముప్పాళ్ళ మండలం చాగంటి వారి పాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ పోలింగ్ బూత్ వద్ద హైడ్రామా నెలకొన్నది వైఎస్ఆర్సిపి సత్తెనపల్లి నియోజకవర్గ అభ్యర్థి మంత్రి అంబటి రాంబాబు తన అనుచరులతో పోలింగ్ శాతాన్ని పరిశీలిస్తున్న సమయంలో అక్కడికి చేరుకున్న ఉమ్మడి అభ్యర్థి మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ తన అనుచరులతో అక్కడికి రావడంతో తీవ్ర ఉద్విక్త వాతావరణం ఏర్పడింది తోపులాటలు వాగ్వి వాదాలతో ఆ ప్రాంతమంతా మారుమరోగింది నామమాత్రంగా ఉన్న పోలీసులు ఘర్షణ నివారించ డంలో విఫలమయ్యారు కొందరు కన్నా అనుచరులను పోలింగ్ కేంద్రాల నుండి బయటికి నెట్టి గేట్లు వేసి జై జగన్ అంటూ నినాదాలు చేశారు ఈ సమయంలో కన్నా అనుచరులు మూకుమ్మడిగా గేట్లు నెట్టుకొని పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. సాధారణ ఎన్నికల్లో ఎప్పుడు ప్రశాంత వాతావర ణంలో జరిగే సత్తెనపల్లి నియోజకవర్గం నేడు జరిగిన ఎన్నికలలో యుద్ధ వాతా వరణం తలపించింది వైసీపీ, టీడీపీ, జన సేన వర్గాలు ఎవరి బలమున్న చోట వారు ఎదుటివారిపై దౌర్జన్యాలు చేయ దానికి ప్రయత్నించటం గమనార్హం ముందస్తుగా సరైన బందోబస్తుని ఏర్పాటు చేయడంలో పోలీసు శాఖ విఫలమైందని ఓటర్లు పలు పార్టీల నాయకులు బహిరంగంగా విమర్శిస్తు న్నారు. పెద్దపెద్ద పోలింగ్ బూత్ లకు ఒకరు లేక ఇద్దరిని మాత్రమే పోలీసుల్ని కేటాయించటాన్ని పలువురు తప్పు పడుతున్నారు.

దాడుల ఘటనలతో ముగిసిన ఎన్నిక

విశాలాంధ్ర-నకరికల్లు : నకరికల్లు మండలంలోని చీమలమర్రి, కుంకలగుంట, రూపెనగుంట్ల, గుండ్లపల్లి గ్రామాలలో వైకాపా - టీడీపీ శ్రేణుల మధ్య పరస్పరం జరిగిన దాడుల నేపథ్యంలో ఇరు వర్గాలకు చెందిన 15 మంది గాయపడ్డారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి దాడులు జరగకుండా ప్రయత్నించారు. ఎండను సైతం లెక్క చేయకుండా మహిళా ఓటర్లు మండలంలోని అన్ని గ్రామాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగా ఓటు హక్కు వినియోగించుకుంటున్న యువకులు ఉత్సాహంతో వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కార్యకర్తలను కాపాడు కొంటాం : కొమ్మాలపాటి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని అధైర్య పడ వద్దని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మలపాటి శ్రీధర్ అన్నారు సత్తనపల్లి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో సోమవారం వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడి సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలను కొమ్మలపాటి శ్రీధర్ పరామర్శించారు. ఎన్నికల్లో ఓటమి భయంతోనే టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడ్డారన్నారు. అచ్చంపేట మండలం మాదిపాడు చెందిన టీడీపీ కార్యకర్త సుభానీని పరామర్శించి, పోలీసులు గ్రామాల్లో ఏకపక్షంగా వివరించడం వలన టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్య కర్తలు దాడులు చేశారన్నారు. ఈ అక్రమ దాడులపై ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు కార్యకర్త లకు అండగా ఉంటామన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని చంద్రబాబు సీఎం కావటం ఖాయమన్నారు.

ప్రశాంతంగా పోలింగ్

విశాలాంధ్ర-దుర్గి : మండలంలో సోమవారం శాసనసభ, పార్లమెంటు సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముటుకూరు, పోలేపల్లి గ్రామాల్లో చిన్న గొడవలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచే ఓటర్లు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. గతంలో మండలంలో హత్యలు గావించబడిన, ఇటీవల బాంబులు, మారణా యుధాలు లభ్యమైన జంగమహేశ్వరపాడు గ్రామంలో పోలింగ్ ప్రశాంతంగా జరగడంలో ఎస్సై కోటయ్య కీలకంగా వ్యవహరించడంతో నిర్భయంగా ఓటు హక్కును వినియోగిం చుకున్నామని ప్రజలు అన్నారు. ముటుకూరు గ్రామానికి జిల్లా ఎస్పీ బింధు మాధవ్ విచ్చేసి పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు.

క్రోసూరు : మండలంలో ఉదయం నుంచి సాగిన పోలింగ్ ప్రక్రియ మధ్యాహ్నం దాకా మందకొడిగా సాగింది. ఒక్కసారిగా ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరడంతో ముగింపు సమయమైన 6 గంటలకు కూడా పోలింగ్ ప్రక్రియ ముగికపోవడంతో బారులు తీరిన ఓటర్లను ఓటింగ్‌కు దూరం కాకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. పోలింగ్ సమయము 6 గంట లకు 72 శాతంగా ఉందని, మండలంలో మహిళలు, పురుషులు కలిపి 50,667 మంది ఓటర్లు ఉన్నారని ఒక్కసారిగా పోలింగ్ పెరగడంతో కొంత కాలాతీతం అవుతుందని 6 గంటల లోపు కేంద్రాల వద్ద ఉన్న ప్రతిఒక్కరికి ఓటు వేయదానికి అనుమతిస్తున్నామని రూట్ ఆఫీసర్ కందుల శ్రీరాములు తెలియజేశారు. మండలంలో చిన్న చిన్న సంఘటనలు తప్ప ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

వినుకొండలో పోలింగ్ ప్రశాంతం

విశాలాంధ్ర- వినుకొండ : పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. అయితే ఉదయం ఏడు గంటలకే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆయా బూతులు వద్ద క్యూలో బారులు తీరారు. పట్టణంలో మొత్తం 45 పోలింగ్ బూతులు ఏర్పాటు చేయగా కొన్ని బూతుల్లో ఈవీఎంలు మొరాయించటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. అయితే ఎండ తక్కువగా ఉన్న కారణంగా ఓటర్లు ఎటువంటి అసహనానికి లోను కాకుండా ఓటు హక్కును విని యోగించుకున్నారు. కాగా 217 బూతులో ఈవీఎం గంటపాటు మొరాయించింది. అలాగే 180 నెంబరు, 204, 181, 184, 187, 214, 215, 210, 211 బూతుల్లో గంటకు పైగా ఈవీ ఎంలు పనిచేయకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. తమ ఓటు హక్కు వినియోగిం చుకునేందుకు మహిళలు, వృద్ధులు, వికలాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇక వినుకొండ పట్టణంలో కూటమి టీడీపీ అభ్యర్థి జీవి, సతీమణి లీలావతి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే స్వగ్రామమైన వేల్పూరులో వైసీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు సతీమణి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే వినుకొండ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లి కార్జునరావు మరో మాజీ ఎమ్మెల్యే వీరపనేని ఎలమందరావు ఓటు వేశారు. అన్ని బూతుల్లో ఎక్కడికక్కడ తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రజలు పెద్ద ఎత్తున బారులు తీరారు. అలాగే హైదరాబాద్ నుండి పెద్ద ఎత్తున ప్రజలు యువతీ, యువకులు బస్సుల్లో వినుకొండ చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొందరు యువతులు తమ తొలి ఓటు హక్కును వినుకొండలో వినియోగించుకున్నారు.కాగా సాయంత్రం 5 గంటల వరకు 72.58% ఓటింగ్ నమోదైనట్లు పోలింగ్ అధికారి తెలిపారు.

అట్టుడికిన మాచర్ల...

▲ వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య రాళ్ల దాడులు
▲ రెంటాలలో జూలకంటి బ్రహ్మారెడ్డిని నిర్బంధించిన వైసీపీ కార్యకర్తలు
▲ పాల్వాయిగేట్‌లో ఎమ్మెల్యే పీఆర్కేను ప్రతిఘటించిన టీడీపీ కార్యకర్తలు

విశాలాంధ్ర-మాచర్ల : నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు యుద్ధ వాతావరణాన్ని తలపించాయి. ఇప్పటి వరకూ ఎన్నడూ లేని విధంగా అధికార, ప్రతిపక్ష పార్టీలు విధ్వంసాలకు పాల్పడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఎమ్మెల్యేగా నాలుగుసార్లు విజయం సాధించిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నియోజకవర్గంలో తన పట్టునుకోల్పోకుండా 5వ సారి వైసీపీ జెండాను ఎగరవేసేందుకు గట్టిగా కృషి చేస్తున్నారు. అదే స్థాయిలో ఎన్డీఏ కూటమి టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి కూడా నియోజకవర్గంలో ఇన్‌చార్జ్‌గా అడుగుపెట్టిన నాటి నుంచి రోజురోజుకు తన ఉనికిని చాటుకుంటూ కార్యకర్తలకు అండగా నిలబడి పార్టీని బలోపేతం చేసుకుంటూ వస్తున్నారు. ఈ తరుణంలో ఇప్పటిదాకా మాకు ఎదురులేదనుకుంటున్న ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులకు కంటిమీద కునుకు లేకుండా చేసుకుంటూ వచ్చారు. చివరకు సోమవారం జరిగిన ఎన్నికలలో టీడీపీ ఏజెంట్లను బూత్‌లలో కూర్చోనివ్వకుండా చేసే ప్రయత్నంలో భాగంగా రెంటచింతల మండలంలోని రెంటాల గ్రామంలో ఇద్దరు టీడీపీ ఏజెంట్ల కుటుంబాలపై వైసీపీ కార్యకర్తలు సోమవారం ఉదయం దాడిచేశారు. దానికంటే ముందు ఆదివారం రాత్రి కూడా టీడీపీ ఏజెంట్లపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ నేపథ్యంలో వైసీపీ, టీడీపీ మధ్య వివాదం మరింత ముదిరింది. ఈ క్రమంలో టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి రెంటాలలో వైసీపీ మూకల చేతిలో గాయపడిన ఏజెంట్లను పరామర్శించేందుకు వెళ్లి అక్కడే పోలింగ్ సరళిని పరిశీలించేందుకు బూత్‌లోకి వెళ్ళగా అదే సమయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు బ్రహ్మారెడ్డిని తలుపులు వేసి నిర్బంధించారు. ఈ దాడులలో ఒప్పిచర్ల, తుమ్మకోట, పాల్వాయి గేటు, జెట్టిపాలెం గ్రామాలలో ఈవీఎంలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఎన్నికల అధికారి శ్యాం ప్రసాద్ మరల ఈవీఎంలను తెప్పించి పోలింగ్‌ను పునరుద్ధరించారు.

భయం గుప్పెట్లో మాచర్ల నియోజకవర్గ ప్రజలు:

సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన ఘర్షణలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. ఓ సందర్భంలో ప్రజలు ఓటు వేసేందుకు కూడా బయటకు రావాలంటే భయపడే పరిస్థితి ఏర్పడింది. రెండు ప్రధాన పార్టీల ఆధిపత్య పోరులో ఒకరిపై ఒకరు చేసుకున్న దాడులను సోషల్ మీడియాలో చూసి ప్రజలు భీతావహులవుతున్నారు.

ఘర్షణలు పోలీసుల వైఫల్యమే:

సోమవారం మాచర్ల నియోజకవర్గంలో జరిగిన ఘర్షణలకు పూర్తిగా పోలీసుల వైఫల్యమే కారణమని ప్రజలు చర్చించుకుంటున్నారు. రెంటచింతల మండలం తుమ్మురు గ్రామంలో సుమారు 200 మంది పోలీసులు ఉన్నప్పటికీ టీడీపీ కార్యకర్తలు ఆయుధాలతో పోలీసుల కళ్ళముందే విధ్వంసానికి వెళ్తుండగా చూస్తూ ఊరుకున్నారే తప్ప వారిని కట్టడి చేయడంలో విఫలమయ్యారు.

స్వల్ప ఉద్రిక్తతల నడుమ పోలింగ్

విశాలాంధ్ర-గురజాల : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రమైన గురజాల మండలంలో సోమవారం పలు చోట్ల స్వల్ప ఉద్రిక్తత వాతావరణంలో పోలింగ్ ముగిసింది. టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య చెలరేగిన ఘర్షణలు పలు గ్రామాల్లో స్వల్ప ఉద్రిక్తతకు దారితీసాయి. ఒకరిపై ఒకరు మాటలతో కవ్వింపు చర్యలకు పాల్పడుతుండడంతో పోలీసులు జోక్యం చేసుకొని ఎటువంటి అల్లర్లకు తావు లేకుండా చేశారు. మండలంలోని జంగమహేశ్వరపురం, మాడుగుల, పులిపాడు, దైద, తెలుకుట్ల, చర్లగుడిపాడు గ్రామాల్లో ఇరుపార్టీల నాయకుల మధ్య స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయి. తెల్లవారు జామున 6 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. మండల వ్యాప్తంగా ఎక్కడా కూడా చెదురుముదురు సంఘటనలు తప్ప అల్లర్లకు తావులేకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్షతగాత్రులను పరామర్శించిన బ్రహ్మారెడ్డి:

మాచర్ల నియోజకవర్గం రెంట చింతల మండలం రెంటాల గ్రామంలో టీడీపీ, వైసీపీ నేతల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో గాయపడి గురజాల ప్రభుత్వాసుపత్రి లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మాచర్ల టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి పరామర్శించారు. రాక్షస పాలన నుంచి త్వరలోనే విముక్తి పొందబోతున్నామని, దాడిలో గాయాలపాలైన వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రశాంతంగా ఉండే గ్రామంలో వైసీపీ నేతలు అల్లర్లకు పాల్పడటం సిగ్గుచేటని మండిపడ్డారు.

మండలంలో ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండలంలో సోమవారం సార్వత్రిక ఎన్నికలు స్వల్ప సంఘటనలు మినహా ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. మండలంలో అన్నవరం గ్రామంలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ జరుగుతున్నప్పుడు టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య వివాదం జరగటంతో పోలీసులు వెంటనే స్పందించి వారిని చెదరగొట్టటంతో వివాదం సద్దుమణిగింది. మండలంలో అన్ని గ్రామాలలో గల పోలింగ్ కేంద్రాలను ఐజి త్రిపాఠి పరిశీలించారు. వృద్ధులు, దివ్యాంగులు, అధికసంఖ్యలో మహిళలు, నూతనంగా ఓటర్లు నమోదైన యువకులు ఓటు హక్కును వినియోగించుకొన్నారు.

మండలంలో అన్నవరం గ్రామంలో 105 సంవత్సరములు వయస్సు కలిగిన కాకుమాను మహాలక్ష్మమ్మ అనే శతాధిక వృద్ధురాలు 17వ సారి ఓటు హక్కును వినియోగించుకొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు తమ కుటుంబ సభ్యులు సహకారంతో పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్ళి ఓటు హక్కును వినియోగించుకొన్నారు. వర్షము కురిసి వాతావరణం చల్లబడటంతో ఓటర్లు ఎండ ప్రభావమునకు గురికాలేదు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సిబ్బంది ఓటర్లకు మంచినీటి సౌకర్యం కల్పించారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలలో పోలింగ్ ప్రశాంతంగా జరగటంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144వ సెక్షన్ అమలు చేయడం జరిగింది. మండలంలో మధ్యాహ్నము వరకు 30 శాతం పోలింగ్ జరిగింది. మండలంలో సాయంత్రం ఐదు గంటల వరకు 76.58 శాతం పోలింగ్ జరిగిందని పోలింగ్ అధికారులు తెలిపారు. గత ఎన్నికల కంటే ఈ ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగియటంతో పోలీసులు, పోలింగ్ అధికారులు, ఓటర్లు ఊపిరిపీల్చుకున్నారు.